




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

గుంటూరు పల్నాడు

సోమవారం 09 ఫిబ్రవరి 2026 - పేజీలు 9


## అమరావతి 'క్వాంటం వ్యాలీ'
### ప్రాజెక్ట్‌లో వ్యవస్థాపక విద్యా భాగస్వామిగా
## ఎస్ఆర్ఎం యూనివర్సిటీ

**మంగళగిరి మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అమరావతి క్వాంటం వ్యాలీ' ప్రాజెక్టులో ఏపీ ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీ వ్యవస్థాపక విద్యా భాగస్వామిగా చేరింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా దేశంలోనే మొట్టమొదటి, ప్రపంచంలో నాలుగోదైన 'క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ' ఏర్పాటు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీ-ఏపీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సిహెచ్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. ప్రేమ్ కుమార్, డీన్-రీసెర్చ్ డాక్టర్ రంజిత్ థాపా, అకడమిక్స్ డీన్ డాక్టర్ వినాయక్ లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివరాలు 8 లో

## కొండవీడు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడంలో ప్రత్తిపాటి అభినవ అణిపోతారెడ్డి
### - కందుల దుర్గేశ్

- కొండవీడు ఉత్సవాల నిర్వహణను ముఖ్యమంత్రికి తెలియచేస్తాను
- ఈ ప్రాంత అభివృద్ధికోసం గతంలో ..ప్రత్తిపాటి ప్రభుత్వానికి అందజేసిన రూ.110 కోట్ల డీపీఆర్ ను కేంద్రానికి పంపించాం

  \- దుర్గేశ్
- కొండవీడు అభివృద్ధికి సహకరిస్తామన్న మంత్రి దుర్గేశ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు
- కొండవీడు అభివృద్ధి కోసం రూ.110కోట్లతో తయారుచేసిన డీపీఆర్ కు త్వరగా ఆమోదం లభించేలా చూడాలని మంత్రిని కోరుతున్నా

  \- ప్రత్తిపాటి

**యడ్లపాడు మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ల కృషి వల్లే రాష్ట్రంలో ఈ 18 నెలల్లో అనేక ఉత్సవాలు నిర్వహించామని, ప్రజల జీవితాల్లో కూడా ఉత్సవ వాతావరణ కనిపిస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేశ్ తెలియచేశారు. ఈ తరహా ఉత్సవాలు రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ ను పెంచుతాయన్నారు.

ఆదివారం ఆయన కొండవీడు ఉత్సవాలకు ప్రత్యేక అతిథిగా హాజరై, కొండపైన... దిగువన ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు, 3 లో



## ఘనంగా ముగిసిన కొండవీడు ఉత్సవాలు

వేలాదిగా తరలి వచ్చిన విద్యార్థులు
జనసంద్రమైన కొండవీడు రహదారులు

**యడ్లపాడు మేజర్ న్యూస్ :** ప్రపంచ పర్యాటక కేంద్రమైన కొండవీడు కోట జనసంద్రమైంది. అశేష ప్రజానీకం కొండవీడు కోటను దర్శించి పులకరించిపోయి తిలకిస్తుండగానే రెండు రోజులపాటు సాగిన కొండవీడు ఫెస్ట్ ఘనంగా ముగిసింది. ఆంధ్రుల పౌరుషానికి నిలువుటద్దంలా నిలిచిన కొండవీడు కోట గోడలు నేడు మళ్ళీ ఆనాటి రాజసంతో పులకించిపోయాయి. రెడ్డి రాజుల పాలనలో హిందూ సామ్రాజ్య రక్షణ కవచంలా నిలిచిన ఈ గిరిదుర్గం, శతాబ్దాల యుద్ధ గాయాలను మాన్పుకుని రెడ్డిరాజుల కొండవీటి కోట... కొండవీడు ఫెస్ట్ వేదికగా ఇప్పుడు తన వైభవాన్ని చాటిచెప్పింది. కాలం ఎన్ని దాడులు చేసినా, శత్రువుల కత్తులు ఎన్నిసార్లు కదం తొక్కినా.. ఇక్కడి సంస్కృతి, తెలుగు వారి అస్తిత్వం మాత్రం ఏమాత్రం చెక్కుచెదరకుండా నిలబడటం మన చరిత్ర గొప్పతనం. 8 లో



## తుళ్లూరి నరసింహారావు వర్ధంతి వేడుకలు ఘనంగా



**తెనాలి మేజర్ న్యూస్ :** వైకుంఠపురం దేవస్థానం వ్యవస్థాపకులు, ధర్మకర్త, బాలాజీ లాడ్జి అధినేత తుళ్లూరు నరసింహారావు గౌడ్ 40 వర్ధంతి, ఆయన సతీమణి తుళ్ళూరు ఆదిలక్ష్మమ్మ 18 వర్ధంతి సందర్భంగా బాలాజీ హోటల్ వద్ద ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తుళ్ళూరు జగన్మోహన్ రావు, తుళ్ళూరు శ్రీనివాసరావు, తుళ్ళూరు మాధవరావు, తుళ్ళూరు వివేకానంద, తుళ్ళూరు ఉదయ్ భాస్కరరావు, కేసన శంకర్రావు, కందుల సాంబశివరావు గౌడ్, కందుల వేణు వర్ధన్, వాకా రామ్ గోపాల్ గౌడ్, వీరంకి రంగారావు, మెకరాల రాము గౌడ్, బెల్లంకొండ సురేష్ గౌడ్, యేమినేని కోటేశ్వరరావు గౌడ్, గుంటూరు కోటేశ్వరరావు, అనంత లక్ష్మీనారాయణ, కుంభం బాలాజీ, మొహమ్మద్ ఖద్దూస్, అన్నం పిన్నారావు తదితరులు గౌడ సంఘం, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అంబరాన్ని అంటుతున్న 'భారత్ రంగ్ మహోత్సవ్' నాటకాలు




### తెలుగు నాటక యవనికపై అంతర్జాతీయ కళా వైభవం

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** గుంటూరు నగర నడిబొడ్డున ఉన్న శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరం ఇప్పుడు ఒక ఆధునిక నాట్యశాలగా రూపాంతరం చెందింది. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఢిల్లీ), తెలుగు నాటక పరిషత్తుల సంఘం (యడ్లపాడు వేదిక) సంయుక్త ఆధ్వర్యంలో కళాబంధు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు సారథ్యంలో జరుగుతున్న 'భారత్ రంగ్ మహోత్సవ్' అంతర్జాతీయ నాటక ఉత్సవం అంబరాన్ని తాకుతోంది. విద్యుత్ దీపాల వెలుగులు ఒకవైపు, నటీనటుల నవరస భావ విన్యాసాలు మరొకవైపు పోటీ పడుతుండగా, విజ్ఞాన మందిరం ప్రాంగణం కళాకారుల పాలిట గొప్ప చైతన్య క్షేత్రాన్ని తలపిస్తోంది. అట్టహాసంగా ప్రారంభమైన ఈ వేడుకలు కేవలం ప్రదర్శనలకు వేదికగా మాత్రమే కాకుండా, అంతర్జాతీయ నాటక కళా వైభవాన్ని తెలుగు నేలకు పరిచయం చేస్తున్న ఒక గొప్ప సాంస్కృతిక వారధిగా నిలుస్తున్నాయి. వివరాలు 7 లో

### నేడు జీఎంసీలో ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి వేదిక

## కమిషనర్ కె.మయూర్ అశోక్




**గుంటూరు మేజర్ న్యూస్:** గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో “ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక“ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా జిఎంసి విభాగాధిపతులతో కలిసి ప్రజల నుండి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## పేదలకు ఆహార భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం- మంత్రి మనోహర్



**తెనాలి, మేజర్ న్యూస్ :** రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న వస్తువుల నాణ్యతపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్థానిక ఎన్వీఆర్ కాలనీలోని రేషన్ షాపులో ఆదివారం నిర్వహించిన గోధుమ పిండి పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి నాణ్యమైన ఆహార పదార్థాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు అవసరమైన ఆహార భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎలాంటి లోపాలు లేకుండా ప్రజలకు సరఫరా జరిగేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్వో కోమలి పద్మ, తహసీల్దార్ కె వి గోపాలకృష్ణ, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పలువురు నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గోరంట్లలో ఘనంగా పోలేరమ్మ తల్లి దేవస్థానం వార్షికోత్సవ వేడుకలు



**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** గోరంట్ల గ్రామంలోని శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానం నందు తొమ్మిదో వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ ,గోరంట్ల గ్రామ మాజీ సర్పంచ్ వేణుగోపాల్ ఈ వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా భారీ ఎత్తున హోమాన్ని నిర్వహించి,అనంతరం తులసి ధర్మ చరణ్,వేణు గార్ల చేతుల మీదుగా అన్నదానం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కంచర్ల ఆంజనేయులు , చల్ల నాగరాజు , పాలపాటి సాయి , తాళ్ల నాగరాజు , గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గురజాల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా చింత లక్ష్మి శ్రీనివాసరావు



**గురజాల మేజర్ న్యూస్ :** మండల ఆర్యవైశ్య అధ్యక్షుడిగా చింత శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా చీతురాల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా మారం రామలింగేశ్వరరావు, కోశాధికారిగా వుటుకూరి నరసింహారావు, పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షుడిగా కాకుమాన్ సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా కామిశెట్టి ఆదినారాయణ, కోశాధికారిగా ఏచూరి శ్రీనివాసరావు డీలర్ ఆర్యవైశ్య మండల యువజన అధ్యక్షుడిగా గుండా రవితేజ, ప్రధాన కార్యదర్శిగా ఏచూరి మణిదీప్, కోశాధికారిగా దివ్వెల మణికంఠ నియమితులయ్యారు.

## మధుమేహ బాధితులు చర్మవ్యాధుల్ని నిర్లక్ష్యం చేయరాదు

### డాక్టర్ డి .అమర్, చర్మవ్యాధుల వైద్య నిపుణులు




**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్:** మధుమేహ బాధితులలో రక్తంలో షుగర్ శాతం అసాధారణంగా అధికంగా ఉండటం వల్ల అనేక సూక్ష్మజీవులు రకరకాల చర్మ వ్యాధులకు కారణమవుతాయని చర్మవ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ డి. అమర్ అన్నారు. ఆదివారం ఉదయం బ్రాడీపేటలోని ఎస్ హెచ్ ఓ సమావేశ మందిరంలో ఎస్ హెచ్ ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్,మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన చర్మవ్యాధుల ఉచిత వైద్య శిబిరం- శాస్త్రీయ అవగాహన సభలో డాక్టర్ డి .అమర్ పాల్గొని ప్రసంగించారు. సభకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ టి .సేవకుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ అమర్ ప్రసంగాన్ని కొనసాగిస్తూ మధుమేహ బాధితులలో రక్తంలో షుగర్ శాతం లో వచ్చు హెచ్చుతగ్గులు రోగ నిరోధక శక్తిపై ప్రభావం చూపుతాయన్నారు. అంతేగాక కొన్ని మధుమేహ నియంత్రణకు వాడే మందులు కూడా రోక నిరోధక శక్తిని తగ్గిస్తాయన్నారు. మధుమేహ బాధితులు షుగర్ పెరిగిపోతుందని ఆహార నియమాలు పాటించడం వల్ల సరైన పోషక ఆహారం శరీరానికి అందదు అన్నారు. శరీరంలోని షుగర్ శాతం అధికంగా ఉండటం వల్ల ,హెచ్చుతగ్గుల వల్ల సూక్ష్మజీవులు పెరగడానికి అనుకూల వాతావరణం ఏర్పడుతుందన్నారు అందువల్ల మధుమేహ బాధితులు లలో ఫంగల్, వైరల్ ,బ్యాక్టీరియల్, స్కేబీస్ (గజ్జి )వంటి పరాన్న జీవ వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయన్నారు .ఫంగల్ వ్యాధులు మరింత వేగంగా వ్యాప్తి చెందుతూ శరీరమంతా వ్యాపించే అవకాశం ఉందన్నారు .అప్పుడు ప్రాణాంతకం అవుతుందన్నారు .శరీరంపై మచ్చలు, పుండ్లు ,దురద చీమ పొక్కులు , చర్మ రంగు మారిపోవటం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే చర్మవ్యాధుల వైద్యుని సంప్రదించాలన్నారు. సూక్ష్మజీవుల వ్యాధులు ఊపిరితిత్తుల వంటి అవయవాలకు వ్యాప్తి చెందక ముందే జాగ్రత్తలు తీసుకొని చికిత్స పొందాలి అన్నారు. ఒక్కొక్కసారి బ్యాక్టీరియా శరీరమంతా వ్యాపించి సెప్టి సీమయాకు దారితీసి ప్రాణాంతకం అవుతుందన్నారు. అందువల్ల ప్రజలు చర్మవ్యాధులను నిర్లక్ష్యం చేయరాదన్నారు. నిపుణులైన వైద్యుల సలహా లేకుండా చర్మవ్యాధులకు మందులు వాడటం ఎంత మాత్రం మంచిది కాదన్నారు. సభలో పాల్గొన్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాన్సిల్ చైర్మన్ టి. ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు మధుమేహం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం ,మధుమేహం బారిన పడిన వారిలో మెరుగైన జీవితాన్ని పొందటమే లక్ష్యంగా తమ సంస్థలు ప్రతినెల ఈ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించటం జరుగుతోందన్నారు .ప్రజలు వైద్య శిబిరాలు తమ ఆరోగ్య పరిరక్షణ కోసమేనన్న విషయాన్ని గ్రహించి ఉపయోగించుకోవాలన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ టి. సేవకుమార్ మాట్లాడుతూ మధుమేహం బాధితులు రక్తంలో షుగర్ శాతాన్ని నియంత్రణ ఉంచుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యల్ని పూర్తిగా నిరోధించి, సాధారణ జీవితాన్ని పొందవచ్చునన్నారు. మధుమేహ బాధితులు నిర్లక్ష్యం వల్లే అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. మధుమేహం నియంత్రణలో ఆహారం ,వ్యాయామం విషయంలలో అశ్రద్ధ ఆలక్ష్యం ఎంత మాత్రం మంచిది కాదన్నారు. డాక్టర్ డి అమర్ చర్మవ్యాధుల బాధితులను పరీక్షించి ఉచిత వైద్య సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ హెచ్ ఓ మేనేజర్ పి .నిర్మల రాణి దంత వైద్య నిపుణులు డాక్టర్ సిహెచ్ .చైతన్య,మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మేకల రామారావు చావా శివాజీ, డి సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ ఫైనల్లో విజ్ఞాన్ నిరుల విజయం




**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** గుంటూరు పెద్దపలకలూరు విజ్ఞాన్ నిరుల మహిళా కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సి.ఎస్.ఇ) విద్యార్థినులు ప్రతిష్టాత్మకమైన అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ ఫైనల్‌లో ప్రథమ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పాతూరి రాధిక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన విజయవాడలోని ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఫైనల్ పోటీల్లో “ క్వాంటం కెమిస్ట్రీ: ఐడెంటిఫికేషన్ ఆఫ్ గ్రౌండ్ స్టేట్ ఆఫ్ హెచ్ 2 ఆటం“ అనే వినూత్న అంశంపై తమ ఆలోచనను సమర్పించి న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారు. హైడ్రోజన్ అణువు (ఎఇ) యొక్క గ్రౌండ్ స్టేట్ ఎనర్జీని క్వాంటమ్ ఆల్గోరిథమ్స్ ద్వారా గణించడం, అలాగే ఆ పరిశోధన ఆధారంగా రియల్-వరల్డ్ అప్లికేషన్ల అభివృద్ధికి ఉన్న అవకాశాలను విద్యార్థినులు తమ ప్రాజెక్ట్‌లో స్పష్టంగా వివరించారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌ను రసాయన శాస్త్ర సమస్యల పరిష్కారానికి వినియోగించే విధానంపై వారు ప్రదర్శించిన అవగాహన ప్రత్యేక ప్రశంసలు పొందింది. మాధ ప్రియ, బొమ్మిశెట్టి నందిని, గంజికుంట సాయి అవంతి, శ్వేత అంగిరేకుల, ఐలం శ్రీజ, కంచర్ల సాహితి సభ్యులుగా ఉన్న ఈ బృందం అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి విజేతలుగా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. రాధిక తెలిపారు. విద్యార్థినుల విజయం పట్ల సి.ఎస్.ఇ విభాగాధిపతి డా. లక్ష్మణ్ నారాయణ, ఐటి విభాగాధిపతి డా. కె. రామకృష్ణ, మెంటార్స్ డా. సత్య సందీప్ మరియు డా. ఏ. పెదగోపి హర్షం వ్యక్తం చేస్తూ, క్వాంటమ్ టెక్నాలజీ వంటి ఆధునిక రంగాల్లో విద్యార్థినులు మరిన్ని సాంకేతిక విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతిష్టాత్మక క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్‌లో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థినుల బృందాన్ని విజ్ఞాన్ విద్యాసంస్థల అధ్యక్షులు డా. లావు రత్తయ్య, ఉపాధ్యక్షులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు ప్రత్యేకంగా అభినందించారు. విజేతలైన విద్యార్థినులు 7 ఫిబ్రవరి 2026న జరిగిన అమరావతి క్వాంటమ్ వ్యాలీ శంఖు స్థాపన కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గౌరవ హెచ్ఆర్డీ మంత్రి శ్రీ నారా లోకేష్ మరియు గౌరవ సైన్స్ & టెక్నాలజీ మంత్రి డా. జితేంద్ర సింగ్ సమక్షంలో రూ. 50,000 నగదు బహుమతి మరియు ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

## శివాలయం టిక్కెట్ కౌంటరు నిర్మాణానికి విరాళం

**పెదకాకాని మేజర్ న్యూస్ :** పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానమునకు రాహుకేతు పూజ మండపము వద్ద భక్తుల సౌకర్యార్థము ప్రత్యేక టిక్కెట్ కౌంటరును దాతల సహాకారముతో ఏర్పాటు చేసినట్లు ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని గ్రామ వాస్తవ్యులు కీవశే। పంది సీతారామయ్య ధృపవ కనకమ్మ కుమారుడు వెంకటశేషగిరావు ధవెంకటేశ్వరమ్మ వీరి కుమారుడు హేమంత్ వెంకటసాయి కుమార్ ఆదివారము ఉదయం లక్ష రూపాయలు విలువ చేయు ఐరన్ కౌంటరును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమములో ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్, మాజీ పాలకమండలి చైర్మన్ దర్శిభాస్కర్, ఉపసర్పంచ్ వలివేటి మురళీకృష్ణ స్థానిక పెద్దలు క్రోసూరు పూర్ణచంద్రరావు, దాత కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిత్య అన్నదానమునకు రూ. 50,000/-లు విరాళము పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి నిత్య అన్నదాన పథకమునకు కృష్ణాజిల్లా, గన్నవరం, సూరంపల్లి వాస్తవ్యులు బెజవాడ కోటేశ్వరరావు ధవ వెంకాయమ్మ దంపతులు ఆదివారము ఉదయం నిత్య అన్న ప్రసాద పథకమునకు రూ. 50,000/-లు విరాళముగా అందించినట్లు ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు.దాతలకు ప్రత్యేక దర్శనము, ఆలయ అర్చకస్వాములు, వేదపండితులచే వేద ఆశీర్వచనము చేయించి శ్రీ స్వామి వారి శేష వస్త్రముతో సత్కరించి, దివ్య ప్రసాదము లడ్డు, చిత్రపటము అందజేసినట్లు ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నప్రసాదమునకు, గోశాల నిర్వహణకు దాతలు సహాయ సహాకారములు అందిచవలసినదిగా భక్తులకు విజ్ఞప్తి చేసినారు. తెలుగుదేశం పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కుక్కల మల్లికార్జునరావు తెలుగు యువత పాగోలు రాము తదితరులు పాల్గొన్నారు.



# కొండవీడు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడంలో ప్రత్తిపాటి అభినవ అణిపోతారెడ్డి : కందుల దుర్గేశ్

మొదటి పేజీ తరువాయి

జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికాశుక్లా, గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ కుర్రా అప్పారావుతో కలిసి వీక్షించారు. అనంతరం కొండపైన ఏర్పాటుచేసిన సభను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగాన్ని వైవీ సుబ్బారెడ్డే అంగీకరించారు

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి వినియోగించింది అసలు నెయ్యే కాదని ల్యాబ్ రిపోర్టులు ధృవీకరించాయని, 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వంలోనే ఈ మహాపాపం జరిగిందని దుర్గేశ్ తెలిపారు.

తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారని సాక్షాత్తూ వైవీ.సుబ్బారెడ్డే అంగీకరించారన్నారు. అదే విధంగా గతంలో అయోధ్యకు పంపిన శ్రీవారి లడ్డూలు విషయాన్ని ప్రస్తావిస్తూ వారే కల్తీ నెయ్యిపై నోరుజారారన్నారు. అయోధ్యకు పంపిన లడ్డూలు వేరే చోట నుంచి తెప్పించామని, వాటితయారీలో కల్తీ జరగలేదని చెప్పడం ద్వారా తిరుమల లడ్డూప్రసాదంలో కల్తీ జరిగినట్టు వారు పరోక్షంగా ఒప్పుకున్నారని దుర్గేశ్ అభిప్రాయపడ్డారు.

వైసీపీ నేతల మాటల్లో పొంతన లేదని, రూ.319లకు నాణ్యమైన ఆవునెయ్యి ఎక్కడి నుంచి లభిస్తుందని ఆయన ప్రశ్నించారు. భోలే బాబా డెయిరీ కేంద్రంగానే ప్రత్యేక శ్రద్ధతో కల్తీనెయ్యి తయారుచేయించారని దుర్గేశ్ స్పష్టంచేశారు.

## కొండవీడు ఉత్సవాల నిర్వహణ విశిష్టతను ముఖ్యమంత్రికి తెలియచేస్తాను




ఘనమైన చారిత్రక నేపథ్యమున్న కొండవీడు ప్రాంత ప్రాశస్త్యాన్ని తెలియచేసేలా రెండురోజులు కొండవీడు ఉత్సవాలకు శ్రీకారం చుట్టిన స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, జిల్లా యంత్రాంగాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్టు దుర్గేశ్ తెలిపారు. వర్షపు నీటి నిల్వకోసం కొండపై మూడు చెరువులు నిర్మించడం, అవి నిండిన తర్వాత ఆ నీరు కిందకు వెళ్లేలా చేపట్టిన నిర్మాణ శైలి ఎప్పటికీ మర్చిపోలేనిదన్నారు. రాష్ట్రంలోని కళా, సాంస్కృతిక వైభవ పునరుద్ధరణతో పాటు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ లు విశేషంగా కృషి చేస్తున్నారని దుర్గేశ్ కొనియాడారు. రాష్ట్రంలో నిర్వహించే ఉత్సవాలకు ప్రజలు లక్షలాది సంఖ్యలో తరలిరావడానికి కారణం కూటమిప్రభుత్వంపై వారికున్న నమ్మకమే అని ఆయన తెలిపారు.

ఏటా కొండవీడు ఉత్సవాలు నిర్వహించే అంశాన్ని ముఖ్యమంత్రి



దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వ ఉత్సవాల క్యాలెండర్ లో వాటికి ప్రాచుర్యం కల్పిస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

కొండవీడు ఖ్యాతి విశ్వవ్యాప్తంలో ప్రత్తిపాటి అభినవ అణిపోతారెడ్డిని తలపిస్తున్నారు. చరిత్ర ప్రకారం నాడు రెడ్డిరాజు అణిపోతారెడ్డి కొండవీడుకోట నిర్మాణంతో ఖ్యాతి గడిస్తే, నేడు ఈ ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తూ, కొండవీడు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడంలో అభినవ అణిపోతా రెడ్డిగా ప్రత్తిపాటి పుల్లారావు నిలిచారని దుర్గేశ్ కొనియాడారు.

ఆయన సంకల్పం సామాన్యమైంది కాదన్న దుర్గేశ్.. ఈ తరహా ఉత్సవాలు, ప్రజలు మెచ్చేలా మౌలిక సదుపాయాల కల్పన చేపట్టడం ఎంతో శ్రమతో కూడిందన్నారు. ఘాట్ నిర్మాణం చూసి ఆశ్చర్యపోయానన్నారు. ఎవరైతే అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తారో అలాంటి నాయకులే చరిత్రలో, ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని దుర్గేశ్ స్పష్టంచేశారు.

..కొండవీడు అభివృద్ధికి ప్రత్తిపాటి రూపొందించిన డీపీఆర్ ను కేంద్రప్రభుత్వానికి పంపాం.

కొండవీడు ప్రాంత అభివృద్ధికోసం గతంలోనే మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఒక డీపీఆర్ తయారు చేశారని, దానిని పర్యాటక శాఖ పరిశీలించి, నిన్ననే కేంద్ర ప్రభుత్వానికి పంపించామని దుర్గేశ్ చెప్పారు. కొండవీడు విశిష్టత దృష్ట్యా, ఆ డీపీఆర్ కు త్వరలోనే ఆమోదం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్ షిప్ లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ 18 నెలల్లో సుమారు రూ.30వేలకోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని, అదేవిధంగా కొండవీడు కోట అభివృద్ధికి తన వంతు సహకారంగా రూ.100 కోట్లు ఇస్తానని గోల్కొండ హోటల్స్ అధినేత నడికట్టు రామిరెడ్డి ముందుకురావడం నిజంగా చాలా గొప్పవిషయమని దుర్గేశ్ పేర్కొన్నారు.

## కొండవీడు అభివృద్ధికి సహకరిస్తానన్న

### మంత్రి దుర్గేశ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు : ప్రత్తిపాటి పుల్లారావు



కొండవీడు అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, కొండపై ఉన్న లక్ష్మీ నరసింహస్వామి, వేంకటేశ్వరస్వామి దేవాలయాల అభివృద్ధి, శివాలయం నిర్మాణానికి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సభాముఖంగా హామీ ఇచ్చారని ప్రత్తిపాటి చెప్పారు.

నేడు పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్ మరో శుభవార్త చెప్పారని, కొండవీడు ప్రాంత అభివృద్ధి నిమిత్తం తయారుచేసిన 110 కోట్ల డీపీఆర్ ను కేంద్రప్రభుత్వానికి పంపినట్టు తెలియచేశారన్నారు. డీపీఆర్ కు త్వరగా ఆమోదం లభించేలా చూడాలని ఈ సందర్భంగా మంత్రికి విజ్ఞప్తిచేస్తున్నట్టు



ప్రత్తిపాటి తెలిపారు. కొండవీడు కోట చారిత్రక సంస్కృతిని, వైభవాన్ని కాపాడేందుకు తనవంతు చేయూత ఎల్లప్పుడూ అందిస్తానని దుర్గేశ్ చెప్పారన్నారు.

నిబద్ధత కలిగిన మంత్రి కందుల దుర్గేశ్ అని, ఆయన సహకారంతో త్వరలోనే కొండవీడులో 30 కాటేజెస్ నిర్మాణాన్ని ప్రారంభించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.

అటవీశాఖ పరిధిలో కొండవీడు కోట ఉన్నందున, దీని అభివృద్ధికోసం అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఏకకాలంలో సమన్వయంతో పనిచేయాలని ప్రత్తిపాటి కోరారు. కొండవీడును ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది, అమరావతిలోనే బెస్ట్ టెంపుల్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని గతంలోనే ప్రకటించారన్నారు. కొండపైన అభివృద్ధికి పర్యాటక శాఖ తరుపున తగిన సహయ సహకారాలు అందిస్తామని సభాముఖంగా తెలియచేసిన మంత్రి కందుల దుర్గేశ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. కోటప్పకొండ తిరునాళ్లను కూడా కనివినీ ఎరుగని విధంగా విజయవంతం చేద్దామని ఈ సందర్భంగా ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. అనంతరం నరసరావు పేట శాసనసభ్యులు చదలవాడ అరవింద్ బాబు



మాట్లాడుతూ కోటప్పకొండ ఉత్సవాలు 15వ తేదీన నిర్వహిస్తున్నామని, వాటిని కూడాప్రజలు విజయవంతం చేయాలని నరసరావుపేట శాసనసభ్యులు అరవిందబాబు కోరారు. కోటప్పకొండ ఉత్సవాలకు తప్పకుండా రావాలని ఆయన ఈ సందర్భంగా మంత్రి దుర్గేశ్ ను సభాముఖంగా ఆహ్వానించారు. త్వరలో జరిగే కోటప్పకొండ ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేశామని, అలానే 30 నుంచి 40వరకు భారీస్థాయిలో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తారని అరవిందబాబు తెలిపారు. కొండవీడుచరిత్ర ఘనతను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ పిల్లలకు తెలియచేయాలన్నారు.

## ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో కొండవీడు అభివృద్ధి

### - జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



2019 తర్వాత, ఇన్నేళ్లకు మరలా కొండవీడు ఉత్సవాలు నిర్వహించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారని, మూడు వారాల్లోనే అన్ని ఏర్పాట్లు చేసి, ప్రభుత్వ సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేశామని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు.

కొండవీడు కోటపై ఉన్న నిర్మాణాలు వీక్షించడానికే ప్రత్యేకంగా హెలీ రైడ్ ఏర్పాటు చేశామని, ఉత్సవాల అనంతరం కూడా పర్యాటకులు కొండపై విడిదిచేసే ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె చెప్పారు. అందులో భాగంగా తొలుత టెంట్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించామన్నారు. కొండవీడుపై పర్యాటకుల కోసం సౌకర్యాలు కల్పించేందుకు ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని కూడా ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. పర్యాటకుల వసతికోసం వచ్చే ఉత్సవాల నాటికి కొండపైన తొలుత 30 గదులు నిర్మించాలని నిర్ణయించినట్టు కలెక్టర్ తెలియచేశారు. రాత్రి పూట ప్రశాంతంగా, ఆహ్లాదంగా గడిపేందుకు కొండవీడు ఎంతో బాగుంటుందని, ఈ ప్రదేశాన్ని భవిష్యత్ లో వెడ్డింగ్ డెస్టినేషన్ గా మార్చే ప్రయత్నాలు ఇప్పటినుంచే ప్రారంభించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. నేటి శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని తలదన్నేలా కొండవీడు నిర్మాణ శైలి ఉందని, దానియొక్క విశిష్టతను విద్యార్థులు, యువత తప్పకుండా తెలుసుకోవాలని ఆమె సూచించారు.

## మంత్రి ..ఎమ్మెల్యేలు.. కలెక్టర్ బోట్ షికారు

### - పుష్ప, ఫలాకృతులు, శాండ్ ఆర్ట్ పరిశీలన.. నిర్వాహకులకు అభినందనలు



రెండో రోజు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ప్రత్యేక అతిథిగా విచ్చేసిన మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, అరవిందబాబు, జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా లను అధికార యంత్రాంగం ఘన స్వాగతంతో ఆహ్వానం పలికింది. కొండపైకి వెళ్లిన అనంతరం మంత్రి, ఎమ్మెల్యేలు శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఉద్యానవన శాఖ ఏర్పాటుచేసిన ప్రత్యేక పుష్ప, ఫలాకృతిని పరిశీలించారు. శాండ్ ఆర్ట్ ను పరిశీలించి నిర్వాహకుల్ని అభినందించారు. అనంతరం ఫుడ్ కోర్టును పరిశీలించి, ఆహారపదార్థాల నాణ్యత ఎలా ఉందని పర్యాటకుల్నిఅడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించిన మంత్రి, ఎమ్మెల్యేలు వారిని ముద్దుచేసి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వారు కొండపైన చెరువులో ఉల్లాసంగా బోటింగ్ షికారు చేశారు.

# భక్తుల మనోభావాలను గౌరవించడమే నిజమైన ధర్మరక్షణ

- తిరుమల లడ్డు వ్యవహారంపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు
- రాజకీయాలకతీతంగా మఠాధిపతులు, పీఠాధిపతులు, ధార్మిక పెద్దలతో రౌండ్ టేబుల్ నిర్వహించాలి.
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.



**తెనాలి, మేజర్ న్యూస్ :** పవిత్రమైన తిరుమల లడ్డు వ్యవహారాన్ని రాజకీయ కక్షసాధింపుగా మలిచే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇది ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం కాదని, కోట్లాది భక్తుల మనోభావాలకు సంబంధించిన అత్యంత సున్నితమైన అంశమన్నారు. తిరుమల లడ్డు విషయంలో కల్తీ జరిగిందన్న అంశంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగిన విచారణలో సీబీఐ నివేదిక స్పష్టమైన వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చినప్పటికీ వైసీపీ నాయకులు ఎదురుదాడి ధోరణితో మాట్లాడటం దుర్మార్గమని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 60 లక్షల లీటర్లుగా చెప్పబడిన నెయ్యిలో ఒక్క చుక్క అసలు నెయ్యి కూడా లేదని నివేదిక స్పష్టం చేసిన తరువాత కూడా మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నాయకులకు లేదన్నారు. అయోధ్యకు పంపిన లడ్డుల విషయంలో ప్రత్యేక నెయ్యి వాడాం అని వైసీపీ నాయకులు చెబుతున్న మాటలే, తిరుమలలో వాడుతున్న నెయ్యి అసలు నెయ్యి కాదన్న విషయం వారికి ముందే తెలుసన్నదానికి నిదర్శనమని మంత్రి వ్యాఖ్యానించారు. అయోధ్యకు పంపిన లడ్డుల కోసం ప్రత్యేకంగా నెయ్యిని తెప్పించారంటే, మిగిలిన లడ్డుల తయారీలో వాడిన పదార్థాల విషయంలో ఐదేళ్లుగా ప్రజలను ఎలా మోసం చేశారో వారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఒక డైరీ సంస్థ నుంచి 1005 కిలోలు, పలమనేరులోని మరో సంస్థ నుంచి మరో 1005 కిలోల నెయ్యిని ప్రత్యేకంగా తెప్పించి అయోధ్య లడ్డుల కోసం వాడామని చెప్పడం అత్యంత బాధాకరమని అన్నారు. తిరుమల లడ్డులు అన్నీ తిరుమలలోనే తయారవుతాయని, వేర్వేరు ప్రాంతాల నుంచి వేర్వేరు పదార్థాలు పంపించి లడ్డులు తయారు చేయడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగత దాడులుగా మలచే ప్రయత్నాలను సమాజం గమనించాలని, ఖండించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఉప మంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచన ఎప్పుడూ హిందూ ధర్మాన్ని కాపాడడమే తప్ప, ఇతర మతాలను కించపరచడం కాదని స్పష్టం చేశారు. తిరుమలలో జరిగిన ఈ తప్పిదంపై సమగ్ర ప్రక్షాళన జరగాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఈ అంశాన్ని రాజకీయాలకతీతంగా తీసుకుని, మఠాధిపతులు, పీఠాధిపతులు, ధార్మిక పెద్దలు, సమాజంలోని బాధ్యతగల వ్యక్తులు అందరూ కలిసి ఒక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి వాస్తవాలు తెలుసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తప్పు జరిగిందని అంగీకరించి, భక్తుల మనోభావాలకు క్షమాపణ చెప్పాల్సిన వారు ప్రెస్ మీట్లు పెట్టి ఎదురుదాడి చేయడం పైశాచిక ఆనందంగా మారిందని విమర్శించారు. తిరుమలతో పాటు ఇతర ఆలయాల్లో కూడా లడ్డు సరఫరా ద్వారా భక్తుల మనోభావాలకు తీవ్రంగా దెబ్బ తగిలిన విషయాన్ని గుర్తించి, సమాజం అప్రమత్తంగా ఉండాలని కోరారు. ధర్మాన్ని కాపాడటం అంటే ద్వేషం కాదు భక్తుల మనోభావాలను గౌరవించడమే నిజమైన ధర్మరక్షణ. ఈ అంశంపై ప్రతి హిందూ భక్తుడు ధైర్యంగా మాట్లాడాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు.

# ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్



**మాచర్ల మేజర్ న్యూస్:** మాచర్ల పట్టణంలో గత కొంతకాలంగా ద్విచక్ర వాహనాల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నవి. ఇందులో భాగంగా నెహ్రూ నగర్ రెండవ వార్డులో నివాసం ఉంటున్న పఠాన్ రంజాన్ యూనికాన్ బైక్ జనవరి 1 2026న తన ఇంటి ముందు వాహనాన్ని నిలిపి మరునాడు ప్రొద్దున్నే లేచి చూడగా తన బైక్ కనిపించలేదు. పటాన్ రంజాన్ పోలీస్ స్టేషన్ కి వెళ్లి ఫిర్యాదు చేశాడు. జిల్లా ఎస్పీ, డీఎస్పీ, ఆదేశాల మేరకు మాచర్ల పట్టణ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో ఇద్దరు ఎస్ఐలు వెంకట్రావు, రమేష్ రెండు బృందాలుగా ఏర్పడి సాంకేతికతను వినియోగించుకొని నిందితుడిని చాకచక్యంగా నెహ్రూ నగర్ మొదటి లైన్ లో పట్టుకొని అరెస్ట్ చేశారు. అతడిని విచారణ చేసి మొత్తం తొమ్మిది బైకులు రికవరీ చేశారు. అతనిపైకేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సైలు వెంకట్రావు, రమేష్ ను పట్టణ సీఐ వెంకటరమణ అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ లను ప్రజలు ఉపయోగించుకోవాలి



**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్ :**ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్), రెవెన్యూ క్లినిక్ లను ప్రజలు ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ప్రతి సోమవారం పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ లను ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించేందుకు జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. రెవిన్యూ క్లినిక్ లలో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, గుంటూరు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారులు గ్రామ స్థాయి రికార్డులతో హాజరు అవుతారని తెలిపారు. మండలాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేసి, ప్రజల నుంచి అర్జీలను నేరుగా స్వీకరించి నమోదు చేయడంతో పాటు, సమస్యల స్వరూపాన్ని బట్టి అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. అప్పటికప్పుడే పరిష్కారం చేయలేని సమస్యలను వారం రోజులలో పరిష్కారం చేయుటకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను డివిజనల్, మండల రెవిన్యూ అధికారులు సమర్పిస్తామని వివరించారు. రెవెన్యూ క్లినిక్ కు నాలుగు కౌంటర్ లు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. మీకోసం వెబ్ సైట్ లో ఆర్జీలు సమర్పించవచ్చు..ప్రజలు తమ సమస్యలను మీకోసం వెబ్ సైట్ లోను అర్జీలు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ చెప్పారు. అర్జీల వివరాలు వీవవనిశీయిఖఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. పి.జి.ఆర్.ఎస్ ను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పి.జి.ఆర్.ఎస్ లో సమర్పించిన అర్జీల స్థితిని 1100 టోల్ ఫ్రీ ఫోన్ నంబర్ కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. అర్జీలను మీకోసం వెబ్ సైట్ లోను సమర్పించవచ్చని చెప్పారు.

# వినుకొండలో శివ మోటార్స్ టీవీ షో రూమ్ లో ప్రారంభం ప్రభుత్వ చీఫ్ విప్ జీవి



**వినుకొండ మేజర్ న్యూస్ :** వినుకొండ పట్టణం కాల్వకట్ట ప్రాంతంలో నూతనంగా ప్రారంభమైన శివ మోటార్స్ ఎలక్ట్రిక్ వెహికిల్ (ఈవీ) షోరూం ను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శుభారంభం చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్ తరాల కోసం పర్యావరణ పరిరక్షణ దిశగా ఎలక్ట్రిక్ వాహనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రజలు ఈవీ వాహనాల వైపు మళ్లడం ద్వారా ఇంధన వ్యయం తగ్గడమే కాకుండా, కాలుష్య నియంత్రణలో భాగస్వాములవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వ్యాపారవేత్తలు, శివ మోటార్స్ యాజమాన్యం, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# అసమర్థతను దాచుకోవడానికే దాడులతో డైవర్షన్ రాజకీయాలు

### – రిటైర్డ్ ఐపీఎస్ ఎ.బి. వెంకటేశ్వరరావు

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :**దుర్భాషలాడటాన్ని హింసగా పరిగణించరాదని, తిట్టుకు సమాధానం దాడి చేయడం కాదని, తిట్టిన వాళ్ళ ఇళ్లపై దాడులకు ఎగబడటం అప్రజాస్వామ్యమని విశ్రాంత డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ర్యాంక్ అధికారి ఎ.బి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో రాజకీయ ఘర్షణలు – రాష్ట్రంపై ప్రతికూల ప్రభావం అనే అంశంపై జరిగిన ముఖాముఖి కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఎ.బి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నత స్థానాల్లో ఉన్నవాళ్లు నోరు పారేసుకోవడం నాడు కెసిఆర్ తో మొదలై నేటికీ కొనసాగుతుందని గుర్తు చేశారు. నేడు రాష్ట్రంలో గల అప్పుల భారం, విద్యుత్ కుంభకోణాలు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఎన్టీఆర్ వైద్య సేవ బకాయిలు, అసంపూర్తిగా నీటిపారుదల ప్రాజెక్టుల లాంటి ప్రధాన సమస్యల నుండి ప్రజలను ప్రక్కదోవ పట్టించడానికి దాడులు, లడ్డు చుట్టూ రాజకీయాలను నడుపుతున్నార న్నారు. గతంలో సమర్థవంతంగా పనిచేసిన పోలీస్ యంత్రాంగం నేడు అధికార పార్టీ నేతల కబంధ హస్తాలలో చిక్కుకుని ఆ ప్రభావాన్ని కోల్పోతుందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష నేతల ఇళ్లపై పోలీసుల సమక్షంలోనే దాడులు చేయడాన్ని అనాగరిక చర్యగా పేర్కొన్నారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్ , జన చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి ప్రసంగిస్తూ ఆహార పదార్థాల కల్తీ లో దక్షిణాది రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ముప్పాళ్ళ ప్రసాద్, వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎన్. వేణుగోపాలరావు, బీసీ జన మహాసభ అధ్యక్షులు ఉగ్గం సాంబశివరావు, విశ్రాంత అడిషనల్ ఎస్పీ కేవీ చలపతిరావు, రైతు ఉద్యమ నేత జొన్నలగడ్డ రామారావు, విశ్రాంత ఆచార్యులు సూరం నారాయణరెడ్డి, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణ రెడ్డి, సామాజిక వేత్త కనపర్తి రాఘవరావు, కోవిడ్ ఫైటర్స్ నేత ముజీబ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.




# 26 వసంతాలు పూర్తి చేసుకున్న వెన్నెల నేత్రాలయం



**వినుకొండ మేజర్ న్యూస్ :** వినుకొండ పట్టణంలోని ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు మరియు పురపాలక సంఘ చైర్మన్, నిరాడంబరుడు, నిగర్వి షేక్. దస్తగిరి షకీలా దంపతులను బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు బెజవాడ వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీ.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ నామ మాత్రపు ఫీజులతో పేదల సేవలో వెన్నెల నేత్రాలయం 26 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారిని సత్కరించుకోవాల్సిన అవసరం మనకు ఉందన్నారు. పురపాలక సంఘంలోని ప్రజలకు మున్సిపల్ చైర్మన్ గా మరియు వార్డు కౌన్సిలర్ గా నిత్యం అందుబాటులో ఉంటూ పుర ప్రజలకు సేవలందిస్తున్న దస్తగిరి దంపతులు అభినందనీయులు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ రెడ్డి నాగ పద్మ తో పాటు జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మరియు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్ పనులతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగవచ్చు

**తెనాలి, మేజర్ న్యూస్ :** ప్రత్తిపాడు 220 కె వి విద్యుత్ సబ్ స్టేషన్ పవర్ ట్రాన్స్ఫార్మర్ కెపాసిటీ పెంపుదల పనులు జరుగుతున్న కారణంగా సోమవారం నుండి ఈ నెల 23 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అక్కల సత్యనారాయణ ఆదివారం తెలిపారు. తెనాలి డివిజన్ పరిధిలోని పట్టణ, రూరల్ గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలిగే అవకాశం ఉందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## ప్రగతిశీల కార్మిక సమైక్య వర్ధిల్లాలి

**గురజాల మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 12 తేదీన, దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను అన్ని రంగాల కార్మికులు కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని ప్రగతిశీల కార్మిక సమైక్య (ఇఫ్టూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురజాల లోని ఇఫ్టూ సభ్యులు:గురసాల దాస్ మేస్త్రి మరియు తాలూరి తామస్ మరియు కలకండ వెంకయ్య ,చింతకాయల పేతురు, ఆటో యూనియన్ వర్కర్స్ మరియు పెయింట్ వర్కర్స్ ,రాడ్ బిల్డింగ్ వర్కర్స్ అదేవిధంగా అన్ని రంగాల వర్కర్లు రేపు 12 వ తారీకున జరగబోయేటువంటి సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయుటకు "ఇఫ్టూ" ఆధ్వర్యంలో పాంప్లెట్లు ఇచ్చి అన్ని రంగాల కార్మికులకు సమ్మెను జయప్రదం చేయవలసిందిగా వివరించడం జరిగింది.

## పేద బ్రాహ్మణులకు నిత్యవసర సరుకుల పంపిణీ




**వినుకొండ మేజర్ న్యూస్:** వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యములో 105వ నిత్యావసర వితరణ కార్యక్రమం స్థానిక విద్యానగర్లోని రఘు మాస్టారు ఇంటివద్ద జరిగింది. ఈ నెలలో చింతలపూడి భద్రయ్య , చింతలచెర్వు రఘు , పుట్టం రాజు నారాయణ రావు ల సహాయసహ కారములతో నాలుగు బీద కుటుంబములకు బియ్యం, నిత్యావసర వస్తువుల వితరణ నిర్వహించారు.ఈ కార్యక్రమం గురించి జి.వి.మాధవరావు మాట్లాడుతూ గత 37సంవత్సరముల నుండి బ్రాహ్మణ సేవాసమితి అనేక సంక్షేమ కార్యక్రమములు చేయుచున్న సంగతి విదితమే అని తెలియ చేస్తూ బ్రాహ్మణ నిరుద్యోగులకు బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ఆవుల పెంపకం, గో మూత్రము, గో మయము ద్వారా అనేక ఉత్పత్తు లను తయారు చేసి,ఆదాయ, వనరులు, పెంపోదించు కొనుటకు,మార్గ ములు గురించి 10రోజుల పాటు విజయవాడ లో శిక్షణ ఇస్తున్నారని శిక్షణ కాలములో ప్రభుత్వమే, మీ ఖర్చులు భరిస్తుందని అని తెల్పినారు. కావున ఉత్సాహవంతులు తనను సంప్రదించ వలసినదిగా కోరారు .ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ పెద్దలు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు – సిఐ సత్యనారాయణ



**గుంటూరు జిల్లా క్రైమ్ మేజర్ న్యూస్:** గుంటూరు నగరంపాలెం పోలీసులు ఆదివారం సాయంత్రం ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. స్టేషన్ పరిధి విజిపి రోడ్డు కృష్ణబాబు కాలనీ సమీపంలో సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామని సిఐ తెలిపారు. వాహనాల పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లను వారు పరిశీలించారు. రాష్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్, సైలెన్సర్లు తీయడం, మైనర్ల డ్రైవింగ్ అంశాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్సైలు రమాదేవి, రామచంద్రారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగాశ్రీ జ్ఞానసాయి అభయాంజనేయస్వామి దేవాలయాల వార్షికోత్సవం -భక్తులకు అన్నదానం





**మంగళగిరి, మేజర్ న్యూస్:** మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి పెదవడ్లపూడి రేవేంద్రపాడు సెంటర్ చైతన్య నగర్ శ్రీ జ్ఞాన సాయిబాబా వారి దేవాలయ 11వ వార్షికోత్సవం, శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవాలయ పదవ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామునుండే బాబావారికి, శ్రీ అభయాంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. బాబావారికి తెల్లవారుజామున కాగడా హారతితో పూజలు ప్రారంభమై, రాత్రి శ్రీ సాయి పల్లకి ఊరేగింపు, శేజ హారతితో పూజలు ముగిసాయి. శ్రీ అభయాంజనేయస్వామి వారికి ఉదయం విశేష అభిషేకములు, శాంతి హోమం, అర్చనలు, శిఖర కలశ కుంభాభిషేకం, కృష్ణుడు, నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లాది విశ్వనాథం సిద్ధాంతి పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, తెలుగుదేశం పార్టీ నాయకులు మాదల రమేష్, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, యేళ్ళ శివరామయ్య, జవ్వాది ఆంజనేయులు, యేళ్ళ శంకరరావు బాబా వారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఈ సందర్భంగా సుమారు 10వేల మంది భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని యార్డ్ చైర్మన్ కిరణ్ చంద్ ప్రారంభించారు. పెదవడ్లపూడి పరిసర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివార్లను దర్శించుకొని, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. దేవాలయాల ప్రాంతంలో ఏర్పాటు చేసిన కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దేవాలయాల కమిటీ ప్రతినిధులు సైకం శివయ్య, పురేటి ఏసుబాబు, కంచర్ల సుబ్బారావు, నాగళ్ళ వెంకట్రావు, చిట్టిబొమ్మ వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్ర సిమెంట్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

### -300 మందికి కంటి వైద్య పరీక్షలు.

**దాచేపల్లి, మేజర్ న్యూస్:** పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామంలో ఆంధ్ర సిమెంట్స్ లిమిటెడ్ సాగర్ గ్రూప్ ఆధ్వర్యంలో డాక్టర్ రామలింగారెడ్డి మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి నరసరావుపేట వ సౌజన్యంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 300 మంది పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈసందర్భంగా ఆంధ్ర సిమెంట్స్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఎటువంటి ఆరోగ్య సమస్య అయినా ఆసుపత్రికి వెళ్లాలంటే లక్షల్లో కూడుకున్న వ్యవహారం అని , నేత్రదానం కన్నా ఉన్న చూపును కాపాడుకోవడం మేలు అని అదేవిధంగా గ్రామీణ ప్రాంతంలో ఎంతో మంది అవగాహన లేక, ఆర్థిక స్తోమత లేక కంటి చూపులు కోల్పోతున్నారని, కంటి సమస్యలు గుర్తించుకోలేకపోతున్నారని తద్వారా చీకట్లో బ్రతుకులు బ్రతికే వారికి ఈ శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని వైస్ ప్రెసిడెంట్ సుబ్బారావు తెలిపారు. వైద్య పరీక్షలు చేసిన అనంతరం ఉచితంగా కంటికి సంబంధించిన మాత్రలు, అవసరమైన వారికి కళ్ళజోళ్లను ఆంధ్ర సిమెంట్స్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తామన్నారు. అదేవిధంగా ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి వారికి రవాణా సౌకర్యం కల్పిస్తామని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. శిబిరంలో 300 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో 30 మందికి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు, అవసరమైన వారికి మందులు, కళ్ళజోళ్ళు పంపిణీ చేసినట్లు డాక్టర్ రాజశేఖర ప్రసాద్ తెలిపారు. హెచ్ఆర్ హెడ్ మణి ప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సురేష్ , కంపెనీ ప్రతినిధులు హెచ్ఆర్ హెడ్ మణి ప్రసాద్, శంకర్ నారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ రాజ కేశవ ప్రసాద్ , కుమారి దుర్గాప్రసాద్, కోటి, జానకి రామారావు, గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.



## నృసింహుని క్యాలెండర్ ఆవిష్కరణ

**మంగళగిరి, మేజర్ న్యూస్:** నగరంలోని మిద్దె సెంటర్ శ్రీ ప్రపత్తి ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన నరసింహుని చిత్రాలతో కూడిన కాలమాని క్యాలెండర్ ను ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర పద్మశాలియ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ ట్రస్టు బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, స్వచ్ఛ ఆంధ్ర మిషన్ డైరెక్టర్, ట్రస్టు సభ్యురాలు ఆరుద్ర భూలక్ష్మి, పీఏసీఎస్ డైరెక్టర్ అందే శివశంకరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి, మయూరి టెక్ బిల్డర్ వింజమూరి శ్రీనివాసరావు, అందే వెంకన్న, జనసేన నాయకులు మునగపాటి వెంకట మారుతీరావు హాజరై క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్, ట్రస్టు సభ్యురాలు ఆరుద్ర భూలక్ష్మి శ్రీ స్వామివారి కార్యక్రమాలకు ఉపయోగించడానికి ట్రస్టుకు వెండి బిందెను అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి సేవా ట్రస్ట్ ప్రతి ఏడాది స్వామివారి అందమైన చిత్రాలతో క్యాలెండర్ ను రూపొందించి భక్తులకు ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. బ్రహ్మోత్సవాలలో స్వామివారు మిద్దె సెంటర్ కి వచ్చిన సమయంలో భక్తులకు పలు రకాలైన ప్రసాదాల పంపిణీ చేస్తూ, భక్తుల నుంచి సేవా ట్రస్టు మన్ననలు పొందుతుందన్నారు. భవిష్యత్తులో కూడా ఆధ్యాత్మిక కార్యక్రమాలలో సేవా ట్రస్టు ముందు ఉండి మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకులు పణిదపు శ్రీనివాసరావు, ట్రస్ట్ సభ్యులు పణిదపు వీరాస్వామి, అందే శ్యాంప్రసాద్, జంజనం నాగేంద్రం, మంద్రు రాము, బట్టు చిదానంద శాస్త్రి, పారేపల్లి దుర్గాప్రసాద్, అద్దంకి వెంకటేశ్వర్లు, శివాలయం ట్రస్ట్ బోర్డు సభ్యులు జంజన వెంకట సుబ్బారావు, భక్త బృందం ప్రతినిధులు మాజేటి గోపాలకృష్ణ, నేరెళ్ల వేములయ్య తదితరులు పాల్గొన్నారు.



# గాలిలో దీపంలా నరసరావుపేట పరిపాలన ఉంది

- మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి
- రెగ్యులర్ డిఎస్పి, రెగ్యులర్ కమీషనర్ లను నియమించలేకపోతున్న స్థానిక ప్రజాప్రతినిధి
- ప్రజలే వీధిదీపాలకు లైట్లు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట పట్టణంలోని 1వ వార్డు (రాముల వారి వీధి, పిట్టల బజార్) లో పర్యటించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో పరిపాలన గాలిలో దీపంలా తయారైందని, ఇక్కడి ప్రజాప్రతినిధి పరిపాలనను గాలికి వదిలేసారని తీవ్రంగా విమర్శించారు. గత రెండేళ్లలో డ్రైనేజీ కాలువలను కేవలం రెండు సార్లు మాత్రమే శుభ్రం చేశారని, ఆ చెత్తను కూడా ఆరు నెలలుగా తొలగించలేదని తెలిపారు. సిమెంట్ రోడ్ల మీద ఉన్న చెత్త కుప్పల నుండి మొక్కలు మొలుస్తున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. పిట్టల బజార్, రాముల వారి వీధి ప్రాంతాల్లో దాదాపు 15 రోజులుగా మంచినీటి సరఫరా లేదని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్, డిఇ, ఎంఇ అధికారులకు ఫోన్ చేసినా సరైన స్పందన లేదని, పైప్‌లైన్ రిపేర్లు చేయడానికి బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలిపారు. వార్డులో ఎక్కడ వీధి దీపాలు వెలగడం లేదని, ప్రజలే స్వయంగా డబ్బులు వేసుకుని వైర్లు, లైట్లు వేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వద్దకు సమస్యల గురించి వెళ్తే మీ కాలువలు మీరే శుభ్రం చేసుకోండి, మీ లైట్లు మీరే వేసుకోండి అని సమాధానం ఇస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఎటువంటి సౌకర్యాలు కల్పించనప్పుడు ప్రజలు మున్సిపల్ పన్నులు ఎందుకు కట్టాలని ఆయన ప్రశ్నించారు. వార్డులో సచివాలయ సిబ్బంది గానీ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు గానీ ఎవరూ పర్యవేక్షించడం లేదని ఆయన విమ ర్శించారు. కంప్లైంట్ ఆయన దగ్గరికి వెళ్లి చెబితే, మీరే కాల్వలు క్లీన్ చేసుకోండి, మీరే లైట్లు వేసుకోండి' అని చెబుతారు. ఇంత బాధ్యతారహితమైన ప్రజా ప్రతినిధిని ఎక్కడా చూడలేదు. ఆయన చెప్పినా కూడా ఏ అధికారులు వినే పరిస్థితి లేదు. నరసరావుపేటకి మున్సిపల్ కమిషనర్ లేదు, డీఎస్పీ లేదు. ఇంతవరకు రెగ్యులర్ డీఎస్పీని నియమించ లేదు. డీఎస్పీ పోస్టు ఖాళీ అయి దాదాపు ఆరు నెలల పైన అవుతోందన్నారు. మున్సిపాలిటీలో , సచివాలయాల్లో సిబ్బంది లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిపాలన గాలికి వదిలేశారు. వాళ్ళ సంపాదన ఏంటి, వాళ్ళు ఎలా సంపాదించుకో వాలనే దానిమీద దృష్టి పెట్టారు తప్ప, ఎక్కడా కూడా ప్రజా సమస్యల మీద పోరాటం లేదు. అదేంటంటే 'మా ఎమ్మెల్యే చీపురు పట్టుకొని మెయిన్ రోడ్డు ఊడుస్తాడు' ఇదే శానిటేషన్ అంటాడు. వార్డుల్లోకి వచ్చి, వార్డుల్లో సమస్యలను పరిష్కరించి, వార్డుల్లో ఏ విధంగా శానిటేషన్ ఉందనే దానిమీద పట్టించుకునే నాథుడు లేడు. ఈ మున్సి పాలిటీ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ఖచ్చితంగా మేము ప్రతి వార్డులో 'గుడ్ మార్నింగ్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వాలంటరీగా ఈసారి నుంచి ఎక్కడైనా వేస్ట్ ఉంటే దాన్ని కూడా క్లియర్ చేసే కార్యక్రమం కూడా మేము చేపడతాం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెదవడ్లపూడి లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం





**మంగళగిరి,మేజర్ న్యూస్:** మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి పెదవడ్లపూడి డీబీయన్ గార్డెన్ లో ఆదివారం రేవేందరపాడు జడ్పీ హైస్కూల్ 1983- 84 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థుల ద్వితీయ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. 152 మంది పూర్వ విద్యార్థులకు గాను 90 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. 1975- 76 బ్యాచ్ పూర్వ విద్యార్థి మాదల రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మేళనాన్ని ప్రారంభించారు. తొలుత బాల్యంలో తమతో విద్యనభ్యసించి వివిధ కారణాలతో మరణించిన బాల్య మిత్రులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పూర్వ విద్యార్థుల పరిచయ కార్యక్రమం జరిగింది. వివిధ ఆటలు, పాటలతో రోజంతాఆనందోత్సవాలతో గడిపారు. గెలుపొందిన వారికి బహుమతుల అందజేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు జాలాది వీరయ్య చౌదరి, విజయ్ కుమార్ లను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆనాటి గురువులు వీరయ్య చౌదరి, విజయ్ కుమార్ మాట్లాడారు. నాడు విద్యార్థులుగా ఉన్న మీరు ఈనాడు షష్టిపూర్తి జరుపుకునే వయసులోకి వచ్చి అమ్మమ్మ, తాతయ్య, నాయనమ్మలుగా కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. మీ వంశంలోని వారందరూ ఆయురారోగ్యాలతో జ్ఞాన సంపదతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థులుగా ఉన్న మీకు పాఠాలు బోధించి, నేడు మీ సమ్మేళనంలో పాల్గొనడంతో నాటి జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకోవడం వలన మాలో నూతన ఉత్సాహం ఉప్పొంగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భావన శ్రీనివాసరావు, లోకం దుర్గారావు, మన్నవ అప్పారావు, ప్రియతమ్ కుమార్, స్టాలిన్, లింగినేని శివయ్య, ఉల్లంగి శ్రీను, రాజారావు, ముత్తవరపు హైమావతి గిరిజ అన్నపూర్ణ అనురాధ, ఫిలోమినా తదితరులు పాల్గొన్నారు.

## చిర్రావూరులో రెండు స్మశాన వాటికలలో అభివృద్ధి చేసిన పనులు ప్రారంభం

- హిందూ, ముస్లీం స్మశాన వాటికలలో రూ. 1 కోటి సొంత నిధులతో అభివృద్ధి పనులు చేయించిన మంత్రి నారా లోకేష్
- మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన చిర్రావూరు గ్రామ ప్రజలు



**మంగళగిరి, మేజర్ న్యూస్:** మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామంలోని హిందూ, ముస్లీం స్మశాన వాటికలలో రూ. 1 కోటి నిధులతో అత్యాధునికంగా అభివృద్ధి చేయించిన పనులను టీడీపీ నాయకులు ఆదివారం పున:ప్రారంభించారు. హిందూ, ముస్లీం స్మశాన వాటికలలో షెల్టర్, స్మశానం లోపల వరకు సీసీ రోడ్డు, నీటి సదుపాయం, సేద తీరడానికి సిమెంట్ బల్లలు, లైటింగ్, గోడలకు రంగులు, మరుగుదొడ్లు, రెండు దహన వాటికలను అన్ని హంగులతో నిర్మించారు. గ్రామంలో హిందూ, ముస్లీం స్మశాన వాటికను అభివృద్ధి చేయించినందుకు గ్రామ ప్రజలు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి ఒక్కరు కూడా ఆధునికరించబడిన స్మశాన వాటికను చూసి ఆనందం వ్యక్తం చేశారు. చొరవ తీసుకొని సొంతనిధులు సమకూర్చిన మంత్రి నారా లోకేష్ ను ప్రతి ఒక్కరూ ప్రశంసించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఎలక్షన్ లో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలోని ప్రతి స్మశాన వాటికను సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. గతంలో ఎవరూ స్మశాన వాటికలను పట్టించుకోలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను మంత్రి నారా లోకేష్ నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్మశానవాటికలను సర్వసౌకర్యాలతో అభివృద్ధి చేయడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, ఎంపీపీ షేక్ జబీనా, ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ ఇబ్రహీం కళ్ళం రాజశేఖర్ రెడ్డి, దాసరి కృష్ణ, కొమ్మారెడ్డి కిరణ్, కొల్లి శేషు, కృష్ణ వందన, కాసరగడ్డ శ్రీనివాస్, నల్లిబోయిన శ్రీనివాసరావు, మక్కపాటి ఏసు ప్రసాద్, మక్కపాటి నాని, దావులూరు అనిల్ కుమార్, కొంక ముసలయ్య, జెట్టి రవీంద్ర కుమార్, దేవ భక్తుని శ్రీనివాసరావు, పటాన్ జానీ ఖాన్, కొల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



**తెనాలి, మేజర్ న్యూస్ :** ఉద్యోగుల సమస్యలు, బకాయిల చెల్లింపునకు కృషి చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు ఆదివారం రాష్ట్ర పౌర సరఫరాలు ఆహార వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ నాదెండ్ల మనోహర్ ను కలసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి తప్పకుండా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఉద్యోగుల బకాయిలు, సమస్యల గురించి ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ ఉద్యోగులకు మేలు చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు అని అన్నారు. తప్పకుండా అసెంబ్లీ బడ్జెట్ సమావేశలలో ప్రస్తవించడమే కాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెనాలి ప్రెసిడెంట్ శివరాత్రి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ సుధారాణి, అసోసియేట్ ప్రెసిడెంట్ డి. సుధీర్ బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ దీపాల శ్రీనివాసరావు, జిల్లా జాయింట్ సెక్రటరీ మోర్ల పోతురాజు మరియు బాపనయ్య బాబు తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



**మంగళగిరి, మేజర్ న్యూస్:** ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును టీడీపీ నాయకులు ఆదివారం లబ్ధిదారుని ఇంటికి వెళ్లి అందజేశారు. మంగళగిరి పట్టణంలోని వెజిటేబుల్ మార్కెట్ కు చెందిన వట్లూరి యశోద కుమారికి మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 41,014 వేల విలువైన చెక్కు మంజూరు కాగా ఆ చెక్కును టీడీపీ నాయకులు లబ్ధిదారుని ఇంటికి వెళ్లి అందజేశారు. చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్ కు లబ్ధిదారుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్ ఫండ్ అండగా నిలుస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, సీఎం చంద్రబాబు నాయుడు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందే విధంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు అధ్యక్షులు వంగర సదాశివరావు, 9వ వార్డు ప్రధాన కార్యదర్శి అనుముల శ్రీనివాసరావు, నందం బాబురావు, పందిరి వెంకన్నబాబు, అక్కల హరిబాబు, కొండవీటి రాంకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**తెనాలి, మేజర్ న్యూస్ :** స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని గౌతమ్ గ్రాండ్ హోటల్ లో తాలూకా బ్రాంచ్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 1990-91 పదవ తరగతి విద్యార్థులు నిర్వహించిన ఈ సమ్మేళనంలో పలువురు పాల్గొన్నారు. తాము చదువుకున్న నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం వారు ఏ స్థితిలో ఉన్నారు, కుటుంబ నేపథ్యం తదితర వివరాలను తెలుసుకున్నారు. నాటి గురువులు సయ్యద్ మహబూబ్, దారా బాలకృష్ణ, కొడాలి రామనాథం, ప్రభాకరశర్మ, సత్యలను ఘనంగా సత్కరించారు. వారి ఆశీస్సులను అందుకున్నారు. ఆత్మీయ సమ్మేళనం విజయవంతంగా నిర్వహించేందుకు కొత్తమాసు అమర్నాథ్, తుల్లిమిల్లి శ్రీనివాస్, తమీజ్, సిహెచ్ అమర్నాథ్, వాసుదేవరెడ్డి, హర్షవర్ధన్ కుప్పాల అజయ్ బాబు, దేవి, సౌజన్య, అనిత, వసంత సహకారం అందించగా నూనె రాజేష్, తోట చంద్రశేఖర్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## మహీంద్రా సమ్మిట్ యొక్క ట్రైఫేమిన్ ను పరిచయం



**గురజాల మేజర్ న్యూస్:** ఈరోజు అంభపురం గ్రామం, గురజాల మండలం, పల్నాడు జిల్లాలో మహీంద్ర సమ్మిట్ అగ్రి సైన్స్ లిమిటెడ్ కంపెనీ చిల్లీ పంటలో "ట్రిఫ్మైన్" అనే కొత్త ఫంగసైడ్‌ను లాంచ్ చేసింది. ప్రవేశపెడుతున్నాం నాలుగు శక్తివంతమైన చర్యలు కలిగిన ప్రత్యేకమైన ఫంగిసైడ్ -- ప్రతిఘటన, చికిత్స, నిర్మూలన, ఆవిరి చర్యలి. మహీంద్రా సమ్మిట్ యొక్క ట్రైఫెమిన్‌లిలిను పరిచయం చేస్తున్నాం. ట్రైఫెమిన్‌లిలి యొక్క ఈ నాలుగు విధాల చర్య పంటలకు సరికొత్తజీవం ఇస్తుంది.ట్రిఫ్మైన్ ఒక కొత్త తరం ఫంగసైడ్, ఇది నాలుగు విధాల అధికారం అందిస్తుంది – రక్షణాత్మక చర్య, చికిత్సాత్మక చర్య, నిర్మూలక చర్య, ఆవిరి చర్య. ట్రిఫ్మైన్‌లో ఇంకా ఆవిరి చర్య ఉండటం వల్ల ఇది చిల్లీలలో ఫంగస్‌ను అత్యంత ప్రభావవంతంగా నియంత్రిస్తుంది. ఈ లాంచింగ్‌లో మహీంద్ర సమ్మిట్ కంపెనీ ప్రొడక్ట్ మేనేజర్ వినోద్, సేల్స్ మేనేజర్ హర్ష వర్ధన్ రెడ్డి, రీజనల్ మేనేజర్ సుబ్బారెడ్డి, డెవలప్‌మెంట్ మేనేజర్ వంశి మరియు గ్రామంలోని సుమారు 200 మంది రైతులు పాల్గొన్నారు. ఇప్పుడు కొత్త తరం ఫంగిసైడ్ వచ్చింది -- ఇది పౌడరీ మిల్డ్యూను పూర్తిగా నిర్మూలించి పంటలకు సరికొత్త ఉత్సాహం కలిగిస్తుంది. ప్రవేశపెడుతున్నాం నాలుగు శక్తివంతమైన చర్యలు కలిగిన ప్రత్యేకమైన ఫంగిసైడ్ -- ప్రతిఘటన, చికిత్స, నిర్మూలన, ఆవిరి చర్యలి.మహీంద్రా సమ్మిట్ యొక్క లిలిట్రైఫెమిన్‌లిలిను పరిచయం చేస్తున్నాం.లిలిట్రైఫెమిన్‌లిలి యొక్క ఈ నాలుగు విధాల చర్య పంటలకు సరికొత్తజీవం ఇస్తుంది.

## టిడిపిపార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన సరిపూడి రామారావు



**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** జలాలపురం గ్రామానికి చెందిన సరిపూడి రామారావు ఆదివారం తన ప్రాథమిక టిడిపి సభ్యత్వానికి రాజీనామా చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపిలో ఉన్నామని కొత్తగా కొత్త నాయకులు వచ్చి తమకంటూ గుర్తింపు పూర్తిగా లేకుండా పోయిందని ఆయన వాపోయారు. గత నాలుగు నెలల క్రితం తనపై దాడి జరిగి హత్యయత్నం చేసినప్పటికీ పార్టీ అధినాయకుడు గానీ మండల నాయకులు గానీ, గ్రామ నాయకులు గానీ కనీసం పరామర్శించటం కూడా జరగలేదన్నారు. చట్టం కూడా కొత్త నాయకులకే చుట్టంగా మారిందని అందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. సుమారు 100 కుటుంబాల వరకు తన వెంట వస్తాయన్నారు. పార్టీని గతంలో బ్రతికించి నిలబెట్టిన ఘనత తనదైనప్పటికీ కొత్త రాజకీయ నాయకులకి అవకాశాలు ఇచ్చి పార్టీని నమ్ముకున్న సీనియర్ నాయకులకు చుక్కెదురు చూపిస్తున్నారని ఆయన అన్నారు. తన రక్తంలో కూడా టిడిపి పార్టీ ప్రవహిస్తుందని అలాంటి తనకే ఎదురు దెబ్బ తగిలిందని అందుకే ప్రాథమికంగా సభ్యత్వానికి రాజీనామా చేసి మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరు బ్రహ్మయ్య కు అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తు కాలంలో తన నిర్ణయాన్ని మరల తెలియజేస్తానని రామారావు తెలిపారు.

## కృష్ణా నది లో 1.5 కి.మీ రివర్ క్రాసింగ్ ఈతల పోటీలు




**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజయవాడ ఆధ్వర్యంలో 26వ వార్షికోత్సవ సందర్భంగా ఈత పోటీలు నిర్వహించారు.సత్తెనపల్లి పట్టణానికి చెందిన నిమ్మగడ్డ హనుమంతరావు, కౌన్సిలర్ షేక్ మహమ్మద్ గని, పెదకూరపాడు హెడ్ కానిస్టేబుల్ రాజేష్ నాయక్ తన కుమారుడు శక్తి స్వరూప్‌తో కలిసి, పెదకూరపాడు కాకతీయ డైరెక్టర్ సాంబశివరావు, హైకోర్టు అడ్వకేట్ గడిపూడి వెంకటేశ్వర్లు అతని కుమారుడు మహావీర్, గర్నేని చలపతిరావు, ఆదిరెడ్డి, షేక్ బుజ్జి తన కుమారుడు జిలానితో, షేక్ బుడే, మాజీ కౌన్సిలర్ పోట్ల ఆంజనేయులు, నరసింహారావు లు ఈ పోటీలో పాల్గొన్నారు. ఆదివారం కృష్ణా నది లో 1.5 కి.మీ రివర్ క్రాసింగ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. వారికి సర్టిఫికెట్ ప్రధానం చేశారు.

# కృష్ణా నదిలో ఈత పోటీలు
# వివిధ రాష్ట్రాల నుంచి 634 మంది స్విమ్మర్స్ హాజరు

### – పోటీలను ప్రారంభించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా



**మంగళగిరి, మేజర్ న్యూస్:** కృష్ణా నదిలో దుర్గా ఘాట్ వద్ద 26వ కృష్ణ రివర్ క్రాస్ స్విమ్మింగ్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. వివిధ రాష్ట్రాల నుంచి 634 మంది స్విమ్మర్లు ఈ పోటీలకు హాజరయ్యారు. పది సంవత్సరాలనుంచి 80 సంవత్సరాల వయసు వాళ్ళు పోటీల్లో పాల్గొన్నారు. ఈత పోటీలను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్న వయసులోనే పిల్లలు ఈత నేర్చుకోవడమే కాకుండా ఇలాంటి పోటీల్లో పాల్గొనడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. పిల్లల చదువులకు వారి భవిష్యత్తుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని, ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించిన ఆక్వా డెవిల్స్ వారు అభినందనీయులని కొనియాడారు. రాష్ట్ర యంత్రాంగం తరపున కూడా ఇటువంటి కార్యక్రమానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అమరావతి కరకట్ట రోడ్డులోని లైలా గంగరాజు నగర్ ఉండవల్లి వద్ద ఉన్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంగణంలో విజేతలకు ఏపీ ఫైర్ సర్వీసెస్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ జనరల్ పి వెంకటరమణ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈత పోటీల్లోని విజేతలకు చెక్కులను, మెడల్స్ ను, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈత పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అధ్యక్షులు లింగి పిల్లి రామకృష్ణ మాట్లాడుతూ తమ అసోసియేషన్ లైఫ్ ఛైర్మన్ గోకరాజు గంగరాజు ఆశీస్సులతో గత 26 సంవత్సరాలుగా కృష్ణ నదులు ఏట పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి ఏటా గంగరాజు సౌజన్యంతో వేసవికాలంలో వారి గెస్ట్ హౌస్ స్విమ్మింగ్ పూల్ లో 300 మంది పిల్లలకు ఈత నేర్పిస్తున్నామన్నారు. ఈ పోటీల నిర్వహణలో ఈతగాళ్ల రక్షణ కోసం రెస్క్యూ ఆపరేషన్ సహకరించిన ఫైర్ డిపార్ట్మెంట్ వారికి, పోలీస్ అధికారులకు, ఇరిగేషన్ అధికారులకు, అసోసియేషన్ సభ్యులకు, మీడియా వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ యార్లగడ్డ రమేష్ కుమార్, కన్వీనర్ వడిపిన రాము, వైస్ ప్రెసిడెంట్ గోపాలం సాంబశివరావు, రామయ్య, రామిరెడ్డి, రిటైర్డ్ కలెక్టర్ ప్రభాకర రెడ్డి గారు, తమ్మ ఉమామహేశ్వర్ రెడ్డి, యం. ఎల్.నరసరాజు, వెలగపూడి వెంకటేశ్వరరావు, మున్నంగి సాంబిరెడ్డి, అద్దేపల్లి వెంకటేశ్వర రాజు, కాకర్లపూడి సాంబశివరాజు, ఆకుల శ్రీనివాస్ కుమార్, సోనోవిజన్ జనార్ధన మూర్తి, అట్లూరి రాజా, పొట్లూరు వెంకటేశ్వర్ రావు, యం ఎల్ యస్ ప్రసాద్ బాబు , పులిపాటి శ్రీనివాస్, బండారు రాంబాబు మరియు ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# అంబరాన్ని అంటుతున్న 'భారత్ రంగ్ మహోత్సవ్' నాటకాలు





మొదటి పేజీ తరువాయి

### దిగ్గజాల దీవెనలు... ప్రముఖుల ప్రశంసలు

ఈ కళాయజ్ఞం రోజురోజుకూ తన ప్రాశస్త్యాన్ని పెంచుకుంటూ, కళాభిమానులను మంత్ర ముగ్ధులను చేస్తోంది. రంగుల ప్రపంచమే శ్వాసగా, రంగస్థలమే ప్రాణంగా బతుకుతున్న సీనియర్ కళాకారుల హృదయపూర్వక ఆశీస్సులు ఈ ఉత్సవానికి కొండంత బలాన్నిస్తున్నాయి. తెలుగు నాటకరంగం అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యే గల్లా మాధవి, గజల్ శ్రీనివాస్, తెలుగు రాష్ట్రాల్లో నాటక కళా పరిషత్ నిర్వాహకులు హాజరై నిర్వాహకులు సురేష్‌బాబును అభినందించారు. కళారంగ దిగ్గజాల ప్రశంసలు జల్లులై కురుస్తుండగా, గుంటూరు చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయంగా లిఖించబడుతోంది.

### తెలుగు నాటక యవనికపై అంతర్జాతీయ కళా వైభవం 'భారత్ రంగ్ మహోత్సవ్'



నాటకరంగ చరిత్రలో సరికొత్త అధ్యాయం ఆవిష్కృతమవుతోంది. కేవలం వినోదానికే పరిమితం కాకుండా, విజ్ఞానపు లోతుల్ని తడుముతూ.. మన మట్టి వాసనతో కూడిన నాటక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే అరుదైన వేదికగా ఈ ప్రదర్శనలు తెలుగు నాటక రంగానికి తార్కాణంగా నిలువనున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత వైవిధ్యభరిత నాటకాలు మన కళ్లముందే సాక్షాత్కరిస్తుంటే, కళాభిమానులకు ఇది ఒక కన్నుల పండుగలా మారింది. ఈ వేడుక కేవలం ప్రదర్శనలకే పరిమితం కాకుండా, ఆధునిక నాటక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను స్థానిక కళాకారులకు, ఔత్సాహికులకు పరిచయం చేసే ఒక విలక్షణమైన 'కార్యశాల'లా రూపుదిద్దుకుంది. దేశియ, విదేశీ భాషా నాటకాల్లోని స్రృజనాత్మకతను, సాంకేతికతను ఆకళింపు చేసుకుని, మన రచయితలు, కళాకారులు అంతర్జాతీయస్థాయి నాటకాలను సృష్టించేలా ఈ వేదిక ఒక ప్రేరణగా నిలుస్తోంది.

### విజ్ఞాన మందిరంలో కళా కేళి
### – నవతరానికి నాటక రంగ పరిచయం

నగరంలోని విజ్ఞాన మందిరం ఇప్పుడు కేవలం ఒక భవనం కాదు, నిత్యం విద్యార్థుల కోలాహలంతో ఉప్పొంగుతున్న ఒక విజ్ఞాన గంగ. ప్రతిరోజూ మధ్యాహ్నం మూడు గంటల వేళ అవుతుందంటే చాలు..ఇక్కడి ప్రాంగణం కళాకారుల మువ్వల సవ్వడితో, విద్యార్థుల ఉత్సాహపూరిత కేరింతలతో పులకించిపోతోంది. కార్యక్రమాలకు ముందస్తుగా నగర వీధుల్లో మహిళలు, కళాకారులు నిర్వహించే భారీ ర్యాలీలు నాటక రంగపు ఉజ్వల చరిత్రను చాటిచెబుతూ ప్రజల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.



### త్రిలింగ దేశంలో త్రిభాష నాటక ప్రదర్శనలు

మూడు రోజుల పాటు సాగిన అంతర్జాతీయ నాటకోత్సవాలు విభిన్న కళారూపాల ప్రదర్శనలతో రంగస్థల చరిత్రలో సరికొత్త అధ్యయాన్ని లిఖించుకుంటున్నాయి. భాషలు వేరైనా భావం ఒక్కటే.. దేశాలు వేరైనా కళాహృదయం ఒక్కటే అని భారత్‌రంగ్ నాటకోత్సవాలు చెబుతున్నాయి. భారత్‌రంగ్ వేదికపై దేశవిదేశీ కళారూపాలు వేటికవే పోటీపడుతూ ప్రదర్శించిన తీరు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. మణిపురి భాష తెలియకపోయినా పద్మశ్రీ రతన్ థీయం రచన, దర్శకత్వంలో కోరస్ రిపెక్టరీ థియేటర్ సమర్పించిన 'కనుప్రియ' నాటకం కృష్ణ పరమాత్మ ఆత్మసంబంధమైన ప్రేమను అద్భుత కళాఖండంగా ఆవిష్కరించి, రసజ్ఞుల హృదయాలను సుతిమెత్తగా తాకింది. రెండోరోజు పోలాండ్‌కు చెందిన థియేటర్ మలబార్ హోటల్ బృందం ప్రదర్శించిన 'ఉమాదేవి అ ఈ సర్వ్ వాండా డైనోస్కా' నాటకం యువతలోని సృజనాత్మకతకు అద్దం పట్టింది.

# ఘనంగా ముగిసిన కొండవీడు ఉత్సవాలు

## వేలాదిగా తరలి వచ్చిన విద్యార్థులు, జనసంద్రమైన కొండవీడు రహదారులు



**మొదటి పేజీ తరువాయి**

పసిపాపల నృత్యాలు, ఇసుక తిన్నెలపై రూపుదిద్దుకున్న సైకత కళాఖండాలు ఆ కోట పరిసరాల్లో కొత్త ప్రాణం పోశాయి. వేలాదిగా తరలివచ్చిన జనసందోహం, విద్యార్థుల కేరింతలతో కొండవీడు ప్రాంగణం కేవలం ఒక పర్యాటక స్థలంగా కాక, తెలుగు వారి ఆత్మీయ కలయికకు వేదికగా మారింది. హెలీ రైడ్‌లో ఆకాశం నుంచి కోటను చూస్తుంటే, ఆ ఎత్తైన బురుజులు మేఘాలను ముద్దాడుతూ గతాన్ని గుర్తుచేస్తున్నట్లు అనిపించాయి. మంత్రులు, ప్రజాప్రతినిధులు సరదాగా బోటింగ్ చేస్తూ పకృతిని ఆస్వాదిస్తుంటే, మరోవైపు గతాన్ని నేటి తరానికి అందించాలనే తపన జిల్లా యంత్రాంగం నెలరోజులపాటు కష్టపడి ఏర్పాటుచేసిన ప్రతి పనిలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. ఈ కోటను అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని వారు ఇస్తున్న మాట, పడుతున్న శ్రమ చరిత్ర ప్రేమికులకు ఒక గొప్ప సంతోషాన్ని ఇచ్చింది. శ్రీనాథుని కవిత్వం, ఖడ్గ మృగాల గర్జనలు, శత్రువులతో యుద్ధాలు, ఆనాటి లిరెడ్డిరాజులలి వీరగాథలు వినిపించిన ఈ నేల మీద మళ్ళీ స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు విశేష కృషితో పండగ వాతావరణం రావడం ప్రతి తెలుగువాడు గర్వించదగ్గ విషయం. కొండవీడు కోట ఖ్యాతి నలుదిశలా వ్యాపించాలని, మన పూర్వీకుల త్యాగాలను భావి తరాల గుండెల్లో భద్రపరుచుకోవాలని కోరుకుంటూ ఈ ఉత్సవం దిగ్విజయంగా ముగిసింది. ఇది కేవలం పండగ మాత్రమే కాదు, మన మట్టి గొప్పతనాన్ని, మన రక్తంలోని ధైర్యాన్ని గుర్తుచేసే ఒక భావోద్వేగ ప్రయాణం. రెండురోజులపాటు ఆహ్లాదకర వాతావరణం లో జరిగిన ఉత్సవాలలో భాగంగా రెండవరోజు ఉత్సవాలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తన సహచర నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవింద్ బాబు తో కలిసి ప్రారంభించారు. తొలుత మొట్టమొదటిసారి కొండవీడు కోట కు విచ్చేసిన కందుల దుర్గేష్ కు స్థానిక శాసనసభ్యులు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు,జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఆర్డీవో మధులత లుపుషగుచ్ఛం ఇచ్చి ఘనస్వాగతం పలికారు.అనంతరం కేరళ





సాంప్రదాయ నృత్యాలతో కొండవీడు కోట కు తోడ్కొని వెళ్ళారు. అనంతరం కొండపై గొలుసుకట్టు చెరువులలో ఏర్పాటు చేసిన బోటింగ్ వద్దకు వెళ్ళి స్వయంగా బోటు షికారు చేశారు. తదనంతరం ఏర్పాటు చేసిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు.అనంతరం ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొండవీడు చరిత్ర అందరూ తెలుసుకోవలసిన అవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అనాటి పాలకులు



ఎంతో ముందు చూపు తో ఏర్పాటు చేసిన గొలుసుకట్టు చెరువులు అద్భుతమని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం టూరిజం ను పూర్తిగా అశ్రద్ధ చేసిందని విమర్శించారు. ఇప్పుడున్న మన ప్రభుత్వం ఎంతో ముందు చూపు తో దాదాపు ముప్పై వేల కోట్ల రూపాయలు పర్యాటకానికి కేటాయింపులు జరిగాయని తెలిపారు. కొండవీటి కోట ఉత్సవాలకు కనివిని ఎరుగని ఏర్పాట్లు చేసిన స్థానిక శాసనసభ్యులు పుల్లారావు, జిల్లా యంత్రాంగం కృషి అభినందనీయమని పేర్కొన్నారు.ఇక పై ప్రతి సంవత్సరం కొండవీడు ఉత్సవాలు నిర్వహిస్తామని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.అనంతరం నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ ప్రత్తిపాటి నేతృత్వంలో కొండవీడు ఉత్సవాలు విజయవంతం అయ్యాయని,అలాగే రాబోయే మహాశివరాత్రి నాడు జరగనున్న కోటప్ప కొండ పై జరగనున్న తిరునాళ్ళ కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉత్సవాలకు విచ్చేసిన మంత్రి దుర్గేష్ కు,సహచర శాసనసభ్యులు అరవింద్ బాబు కు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా జ్ఞాపిక లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## అమరావతి 'క్వాంటం వ్యాలీ' ప్రాజెక్ట్‌లో వ్యవస్థాపక విద్యా భాగస్వామిగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ



**మొదటి పేజీ తరువాయి**

ఎస్ఆర్ఎం వర్సిటీ లో ఏర్పాటు చేయబోయే క్వాంటమ్ రిఫరెన్స్ సెంటర్ రానున్న రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ వేదికగా నిలుస్తుంది. స్టార్టప్‌లు, పరిశోధకులు, పరిశ్రమలు తమ క్వాంటం కంప్యూటింగ్ భాగాలను పరీక్షించడానికి, వాటి పనితీరును అంచనా వేయడానికి ఇది ఉపయోగపడుతుంది. క్వాంటం శాస్త్ర సాంకేతికతలలో పరిశోధన, బోధన, శిక్షణను ప్రోత్సహించడానికి విశ్వవిద్యాలయం ప్రత్యేకంగా ఒక క్వాంటం ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇందులో ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, మ్యాథమెటిక్స్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయి. అంతేకాకుండా విద్యార్థులకు క్వాంటం కంప్యూటింగ్, కమ్యూనికేషన్, మెటీరియల్స్ వంటి రంగాలలో హ్యాండ్స్-ఆన్ లాబొరేటరీస్, ఇంటర్న్‌షిప్‌లు, స్టార్టప్ ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్‌ల ద్వారా ప్రపంచ స్థాయి అనుభవాన్ని అందిస్తారు.ఈ సందర్భంగా యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సతీష్ కుమార్ మాట్లాడుతూ, "క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ స్థాపన అనేది పరిశోధనలో మా నిబద్ధతకు




నిదర్శనమన్నారు. 'మేడ్ ఇన్ ఇండియా' క్వాంటం కంప్యూటర్లు, అప్లికేషన్‌లను అభివృద్ధి చేసేలా భవిష్యత్తు శాస్త్రవేత్తలను, ఇంజనీర్లను తయారు చేయడమే మా లక్ష్యం. ఈ గొప్ప అవకాశాన్ని కల్పించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మా ధన్యవాదాలు అన్నారు.

ఈ భాగస్వామ్యం ద్వారా మన రాష్ట్రం రాబోయే రోజుల్లో డీప్-టెక్నాలజీ ఆవిష్కరణలకు గ్లోబల్ హబ్‌గా మారుతుందని, క్వాంటం సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో మన దేశం ప్రపంచ నాయకుడిగా ఎదుగుతుందని ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఏపీ ఆర్ ఎస్ ఏ. పల్నాడు జిల్లా అధ్యక్షులుగా నాగమల్లేశ్వరరావు



**మాచవరం మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులుగా మాచవరం మండల తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నరసరావుపేట ఆర్డీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఎన్నికల్లో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ గా జి శ్రీనివాసరావు సెక్రటరీగా వివి నాగరాజు , ఇతర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు .అనంతరం నూతన కమిటీ అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు తో సహా ప్రమాణ స్వీకారం చేశారు అనంతరం తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు శాలువాతో పూలదండలతో ఘనంగా సన్మానించారు. నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రెవిన్యూ సమస్యలపై హక్కుల కొరకు తన పోరాటం ఎప్పుడు కొనసాగుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్ ఎస్ ఏ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఎన్.లక్ష్మినారాయణ, రీజనల్ మేనేజర్, ఫోన్ నెం. 63011 07116

## శ్రీ శ్రీ శ్రీ మహంకాళి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి 1,01116 రూల విరాళం



**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** నరసరావుపేట ఇస్సాపాలెం లోని ప్రముఖ ప్రసిద్ధిగాం చిన శ్రీ శ్రీ శ్రీ మహంకాళి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణం నిమిత్తం ఇస్స పాలెం గ్రామస్తులు శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో స్వీపర్ గా పనిచేస్తున్న వేముల రాములమ్మ కుమార్తె రాపూరి పుష్పలత అల్లుడు నాగరాజు 1,01116/- రూల నగదుని ఆలయ కార్యనిర్వహణా ధికారిని నల్లబోతు మాధవి కి అందజేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లబోతు మాధవి మాట్లాడుతూ ఆలయ పునః నిర్మాణానికి తమ వంతు సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బండమూరి చంద్రశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ప్రగతిశీల కార్మిక సమైక్య వర్ధిల్లాలి



**గురజాల మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 12 తేదీన, దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను అన్ని రంగాల కార్మికులు కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని ప్రగతిశీల కార్మిక సమైక్య ,(ాఖూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురజాల లోని ాఖూ సభ్యులు:గురసాల దాస్ మేస్త్రి మరియు తాలూరి తామస్ మరియు కలకండ వెంకయ్య ,చింతకాయల పేతురు, ఆటో యూనియన్ వర్కర్స్ మరియు పెయింట్ వర్కర్స్ ,రాడ్ బిల్డింగ్ వర్కర్స్ అదేవిధంగా అన్ని రంగాల వర్కర్లు రేపు 12 వ తారీకున జరగబోయేటువంటి సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయుటకు "ాఖూ" ఆధ్వర్యంలో పాంప్లెట్లు ఇచ్చి అన్ని రంగాల కార్మికులకు సమ్మెను జయప్రదం చేయవలసిందిగా వివరించడం జరిగింది.

## ఏపీ ఆర్ ఎస్ ఏ. పల్నాడు జిల్లా అధ్యక్షులుగా నాగమల్లేశ్వరరావు



**మాచవరం, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులుగా మాచవరం మండల తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నరసరావుపేట ఆర్డీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఎన్నికల్లో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ గా జి శ్రీనివాసరావు సెక్రటరీగా వివి నాగరాజు , ఇతర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు .అనంతరం నూతన కమిటీ అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు తో సహా ప్రమాణ స్వీకారం చేశారు అనంతరం తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు శాలువాతో పూలదండలతో ఘనంగా సన్మానించారు. నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రెవిన్యూ సమస్యలపై హక్కుల కొరకు తన పోరాటం ఎప్పుడు కొనసాగుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్ ఎస్ ఏ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్న సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్

**- కోటప్పకొండ విశిష్టతను సినీ నటుడు రాజేంద్రప్రసాద్ కు వివరించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ**



**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** ప్రముఖ శైవ క్షేత్రంగా పేరుగాంచిన కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామివారిని ప్రముఖ సినీ నటుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత రాజేంద్రప్రసాద్ ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధికి విచ్చేసిన ఆయనకు బీసీ వెల్ఫేర్ శాసనసభ కమిటీ సభ్యులు, శాసనస భ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆలయ ప్రాంగణంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా త్రికోటేశ్వర స్వామివారికి నిర్వహిం చిన ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలలో సినీ నటుడు రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసి సత్కరిం చారు. కోటప్పకొండ వైభవం, మహాశివరాత్రి తిరుణాళ్ల సందర్భంగా చేపడుతున్న విస్తృత ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యే, రాజేంద్రప్రసాద్‌కు వివరించారు. ముఖ్యంగా భక్తులను ఆకట్టుకు నేలా ఏర్పాటు చేయనున్న భారీ విద్యుత్ ప్రభలు, భద్రతా చర్యలు, తాగునీరు, పారి శుధ్యం, రవాణా వంటి సౌకర్యాలపై సమాచారం ఇచ్చారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్క రించుకుని సుమారు 20 నుంచి 25 లక్షల మంది భక్తులు కోటప్పకొండకు విచ్చేసే అవకాశ ముందని తెలిపారు. ఆలయ దర్శనం అనంత రం రాజేంద్రప్రసాద్ కోటప్పకొండ ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రశంసిస్తూ, ఇలాంటి పవిత్ర క్షేత్రాలు భక్తిలో మరింత నమ్మకాన్ని పెంచుతాయని పేర్కొన్నారు.

# బార్ కౌన్సిల్ ఎన్నికలలో బీసీ అభ్యర్థులను గెలిపించండి

**- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన**

**తెనాలి, మేజర్ న్యూస్ :** ఈనెల 13వ తేదీన జరుగునున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో బిసి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన్న శంకర్రావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన తెనాలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మేధావులైన న్యాయవాదులు మహిళలు పురుషులు అందరూ తప్పనిసరిగా బీసీ అభ్యర్థులకే అన్ని ప్రిఫరెన్షియల్ ఓట్లు వేసి కౌన్సిల్ సభ్యులుగా బీసీ అభ్యర్థులను హెచ్చు సంఖ్యలో గెలిపించాలని కోరారు. బీసీ మహిళలకు రిజర్వేషన్లు ఉన్నందున మహిళ లు కూడా పోటీలో ఉన్నందున వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. దేశంలో చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ లేనందున రాజకీయంగా నష్టపోతున్నారని, తత్ఫలితంగా ఏ రంగంలోనూ తమ వంతు వాటాను పొందలేకపోతున్నారని అన్నారు. ప్రస్తుత బార్ కౌన్సిల్లో కూడా మహిళలకు 30 శాతం రిజర్వేషన్లు కల్పించారే కానీ ప్రత్యేకంగా బీసీలకు ఇవ్వలేదన్నారు. గత ఎన్నికల్లో జరిగిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని బీసీలందరూ బీసీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు గత 70 ఏళ్లుగా బీసీలు ఆధిపత్య కులాలకు ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపిస్తూ వచ్చారని ఈసారి రాజ్యాంగంలోని సామాజిక న్యాయం దృష్ట్యా అందరూ బీసీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు జొన్నాదుల వెంకటేశ్వరరావు, కుర్ర శీను, ఓలేటి శివాజీ, మీరావలి, జోరిగే మోహన్, కేసన స్వాములు, సతీష్, జొన్నాదుల సాయి, ఎంవివి నాగలింగం తదితరులు పాల్గొన్నారు.



# రూ.2వేల కోట్ల విలువైన భూమిని కాజేసేందుకు చంద్రబాబు ప్రభుత్వ కుట్ర

**- వక్ఫ్ భూముల జోలికి వస్తే సహించేది లేదు**

**- ఎమ్మెల్సీ మురుగుడు, నమన్వయకర్త దొంతిరెడ్డి, తూర్పునియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా**



**మంగళగిరి మేజర్ న్యూస్:** గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం చినకాకానిలో వున్న 72 ఎకరాల అంజుమాన్ ఇస్లామియా సంస్థకు చెందిన 2 వేల కోట్ల రూపాయల వ్యవసాయ భూములను కాజేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా విమర్శించారు.గుంటూరు మంగళదాస్ నగర్ లోని షేక్ నూరి ఫాతిమా నివాసం నుండి మంగళగిరికి భారీగా ర్యాలీతో తరలి వచ్చారు. మంగళగిరి మండలం చినకాకానిలో ఉన్న వక్ఫ్ భూములను ఆదివారం వారు పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం మురుగుడు హనుమంతరావు, దొంతిరెడ్డి వేమారెడ్డి, షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం దొంగ జీవోలతో వక్ఫ్ భూములను కాజేయడానికి యత్నిస్తోందని, ఆ భూములను బడా వ్యాపార వేత్తలకు ధారాదత్తం చేసేందుకే ఈ కుట్ర అని అన్నారు. ఇప్పటికే రాజధానిలో అభివృద్ధి పేరుతో వేల ఎకరాలను ప్రభుత్వం తీసుకుందని రెండు సంవత్సరాలు గడిచినా అభివృద్ధి శూన్యమని అన్నారు. ముస్లిం సంస్థలకు చెందిన స్థిరాస్తులను లాక్కునేందుకు ప్రయత్నాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని, చంద్రబాబు ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. చినకాకానిలోని 71.57 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడానికి వక్ఫ్ బోర్డు గానీ, భూమి యజమానులైన అంజుమాన్-ఇ-ఇస్లామియా గానీ అనుమతి ఇవ్వకపోయినా చంద్రబాబు ప్రభుత్వం చట్టబద్ధమైన ప్రక్రియను పాటించకుండా నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. మల్లాయపాలెం ప్రాంతంలో కూడా భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఏ రాజకీయ పార్టీ కూడా ఈ భూముల జోలికి రాలేదని ఈ వ్యవహారం మైనార్టీలను బాధపెట్టడమేనని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు.



### ఛలో కలెక్టరేట్ కు తరలిరండి

ఈ విషయమై ఈనెల 9న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నామని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని షేక్ నూర్ ఫాతిమా కోరారు. ఈ భూములపై ఆధారపడిన పాఠశాలు, మసీదు, రైతులు, షాదీఖానాలకు సంబంధించిన అందరి వద్ద నుండి అభ్యంతరాలను స్వీకరించి వాటిని కలెక్టర్ కు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు ధర్నా చౌక్ నుండి కలెక్టర్ కార్యాలయంకి ర్యాలీ గా వెళ్ళి గ్రీవెన్స్లో అభ్యంతర పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ మంగళగిరి మండల అధ్యక్షులు నాలి వెంకట కృష్ణ, తాడేపల్లి పట్టణ, మండల అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నుంకర రఘుపతి, వైస్సార్సీపీ జిల్లా, మండల, పట్టణ మైనార్టీ నాయకులు సుభాని, చాంద్బాషా, మాలిక్ బాబు, యస్కె షఫీ, హుస్సేన్, ముస్లిం సమైక్యవేదిక నాయకులు మౌలా బేగ్, హాజీ మహమ్మద్, షేక్ హుస్సేన్, షేక్ సమీవుల్లా. గుంటూరు వైఎస్సార్సీపీ నాయకులు పటాన్ సైదాఖాన్, ఖాసిం బేగ్, లియాఖత్ అలీ, నలీమ్, కరీమ్, కార్పొరేటర్ బాబు, రాజేష్, జానీ బాషా, సుభాని, రబ్బాని, శ్రీకాంత్రెడ్డి, అమీనా షరీపుద్దీన్, జాని బాషా తదితరులు పాల్గొన్నారు.